క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

చొప్పదండి: ఇటీవల యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లాలోని సన్‌రైస్ తైక్వాండో అకాడమీకి క్రీడాకారులు ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జనవరిలో రాజస్తాన్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో సీనియర్ ప్లేయర్స్ సంతోష్, సతీశ్‌కుమార్, రాజేందర్, లహరి, శ్రీజ, రమ్య, నాగమణి, అంజలి పాల్గొననున్నారు. ఈసందర్భంగా క్రీడాకారులను గందె సంతోష్, దొంతుల మనోహర్, కోల గంగారాం, శ్రీగాధ సంతోష్ అభినందించారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్

గంగాధర: మండలంలోని మధురానగర్‌లో గల వివేకానంద లిటిల్ జీనియస్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చాటి పతకాలు సాధించినట్లు కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఇటీవల జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగిన పోటీల్లో బాలుర కటా విభాగంలో శ్రీవాత్సవ బంగారు పతకం, బాలికల కటా విభాగంలో ఎస్.చంద్రిక కాంస్య పతకం సాధించారు. ఈసందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ ఉషారాణి, కరాటే మాస్టర్ శ్రీనివాస్ అభినందించారు.

ట్రావెల్ బ్యాగ్స్ అందజేత



ట్రావెల్ బ్యాగ్స్ అందజేసిన యాజమాన్యం

రామడుగు: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని శనివారం మండలంలోని గోపాల్‌రావుపేట శ్రీప్రగతి పాఠశాల సిబ్బందికి స్వర్గీయ మండవ నాగేశ్వర్‌రావు పేరుతో యాజమాన్యం ట్రావెల్ బ్యాగ్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అన్నదానం రాధాకృష్ణ, ప్రిన్సిపాల్ వెంకట్‌నారాయణ, డైరెక్టర్లు మునీందర్‌రెడ్డి, భూమయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల నూతన కార్యవర్గం

వీణవంక: మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామ గణేశ్ కళాకారుల సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గోనెల సమ్మన్న తెలిపారు. అధ్యక్షుడిగా గోనెల పెద్దులు, గౌరవ అధ్యక్షుడు రాయణవేణ రాజయ్య, సలహాదారు కొలిపాక రామస్వామి, ప్రధాన కార్యదర్శి పూదరి రమేశ్, సంయుక్త కార్యదర్శి సంపత్, కోశాధికారిగా దూలం నరేశ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సమ్మన్న మాట్లాడుతూ కళాకారుల సంక్షేమం కోసం పాటుపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి, మాజీ సర్పంచ్ ముద్దసాని సమ్మయ్య, పోచయ్య, వీరారెడ్డి, దూలం అంజి తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెషర్స్ డే హంగామా



నృత్యం చేస్తున్న విద్యార్థులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామంలో గల కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కందుకూరి శంకర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యంతో ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. ఉద్యోగ సాధనకు స్కిల్స్‌పై దృష్టి సారించాలని, కళాశాల కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అయ్యప్ప ఆలయానికి విరాళం

చొప్పదండి: మండల కేంద్రానికి చెందిన గుర్రం మల్లారెడ్డి, స్వరూపరాణి దంపతులు స్థానిక శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయానికి శనివారం రూ.10,121 విరాళం అందించారు. ఈ మేరకు ఆలయ చైర్మన్ బొడిగె వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణకు విరాళం అందించారు. ఉస్కె రాజశేఖర్‌రెడ్డి, ఎన్నం మునీందర్, గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, కళ్లెం జైపాల్‌రెడ్డి, బత్తిని ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, వరంగల్ ఆర్‌డీఎంఏ సయ్యద్ మసూద్ అన్నారు. శనివారం మున్సిపల్ పరిధి 30 వార్డుల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జమ్మికుంట మండలం నాగంపేట, పాపయ్యపల్లి, పాపక్కపల్లి గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాలు జరిగాయి. తహసీల్దార్ రజని, ఎంపీడీవో కల్పన హాజరై ప్రజలకు అవగాహన కల్పించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ సంతోష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హుజూరాబాద్ బల్దియాలో..

హుజూరాబాద్: ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేట్ వరంగల్ రీజినల్ డైరెక్టర్ సయ్యద్ మసూద్ సూచించారు. మున్సిపల్ పరిధిలో జరుగుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని వేర్వేరుగా సందర్శించి పరిశీలించారు. దరఖాస్తు ఫారాలకు ఎలాంటి కొరతలేదని, ఎవరైనా విక్రయించినా, జిరాక్స్‌లు తీసి అమ్మినా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులందరికీ ఆరు గ్యారెంటీలను త్వరలోనే సమగ్ర విచారణ అనంతరం అమలు చేయడం జరుగుతుందన్నారు. హుజూరాబాద్ పరిధిలోని 30 వార్డుల్లో 4,506 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని కమిషనర్ సమ్మయ్య తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, హుజూరాబాద్ ఆర్డీవో ఎస్. రాజు, ప్రజాపాలన ప్రత్యేక అధికారి పద్మావతి, వైస్‌చైర్మన్ నిర్మల, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలోని అల్గునూర్‌లో ప్రజాపాలన సభలు శనివారం ప్రారంభమయ్యాయి. మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రజాపాలన సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు చర్యలు చేపడుతోందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రేషన్ కార్డు లేనివారు కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో ఒక్క కొత్త రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదన్నారు. తమ ప్రభుత్వం హయాంలో రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని వివరించారు. అనంతరం మండలంలోని కొత్తపల్లిలో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కవ్వంపల్లికి సన్మానం చేశారు.

చెరువుకట్ట పనులు పరిశీలన

మానకొండూర్: మానకొండూర్ చెరువు కట్ట వద్ద సుడా నిధులతో చేపడుతున్న పనులను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. గతంలో చేపట్టిన పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని, నాణ్యత లోపానికి కారణాలను తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, మండల అధ్యక్షులు నందగిరి రవీంద్రచారి, సర్పంచ్ బోళ్ల మురళీ, ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి, సాయిరి దేవయ్య, కొత్తకొండ శంకర్, మధుసూదన్, కోంద్ర సురేశ్ పాల్గొన్నారు.

పేద ప్రజల కోసమే సంక్షేమ పథకాలు

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సత్యం

రామడుగు: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం చేపట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం కోరారు. మండలంలోని వెలిచాల గ్రామంలో శనివారం జరిగిన ప్రజాపాలన గ్రామసభకు హాజరై మాట్లాడారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ప్రజాపాలన కార్యక్రమంలో ఇవ్వాల్సిన దరఖాస్తులను పూర్తి సమాచారంతో అందించాలని, దీనికి గడువు తేదీ ఉందని తొందరపడవద్దన్నారు. గ్రామసభలు ముగిసిన తర్వాత కూడా దరఖాస్తులు అందించవచ్చని పేర్కొన్నారు. కాగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను సర్పంచ్ వీర్ల సరోజన శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ శ్రీలతారెడ్డి, మండల ప్రత్యేకాధికారి ప్రియదర్శిని, సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు, ఎంపీపీ కలిగేటి కవిత, జెడ్పీటీసీ లక్ష్మి, ఎంపీడీవో భాస్కర్‌రావు, తహసీల్దార్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ డాక్ సేవలు అమూల్యమైనవి



సన్మానిస్తున్న వినోద్‌కుమార్, ఉద్యోగులు

హుజూరాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో పోస్టల్‌తో పాటు బ్యాంకింగ్ సేవలు అందిస్తున్న గ్రామీణ డాక్ సేవకుల పాత్ర ఎంతో ప్రముఖమైందని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. బోర్నపల్లి గ్రామ పోస్ట్‌మాస్టర్‌గా 28 ఏళ్ల పాటు ప్రజలకు సేవలు అందించి శనివారం ఉద్యోగ విరమణ పొందిన వేముగంటి జానకిదేవి-రవీందర్‌రావు సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు, ఆ లిండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు యు.మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రోజాదేవి సేవలు అభినందనీయం



ప్రిన్సిపాల్ రోజాదేవిని సన్మానిస్తున్న సిబ్బంది

తిమ్మాపూర్: స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్టు, మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల, వృత్తి శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ రోజాదేవి సేవలు అభినందనీయమని ట్రస్టు సభ్యులు ప్రశంసించారు. రోజాదేవి శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈసందర్భంగా ఎల్ఎండీ కాలనీలోని మానసిక వికలాంగుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ట్రస్టీ సముద్రాల జనార్దన్‌రావు అధ్యక్షత వహించి మాట్లాడారు. రోజాదేవి మానసిక వికలాంగ విద్యార్థులకు ఎనలేని సేవలందించారని, ఉపాధ్యాయులందరూ ఆమె మాదిరిగానే సేవాలందించాలని కోరారు. ఆమె శేష జీవితం ఆరోగ్యంతో, ఆనందంతో సుదీర్ఘ కాలం జీవించాలని కాంక్షించారు. అనంతరం రోజాదేవి మాట్లాడుతూ, మానసిక వికలాంగ విద్యార్థులతో తనకు 28 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. వృత్తి జీవితం ఎంతో సంతృప్తిని ఇచ్చిందని తెలిపారు. ఇప్పుడు వారిని విడిచి వెళ్లడం చాలా బాధగా ఉందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులందరూ క్రమశిక్షణతో సేవలందిస్తున్నారని, ఈవిధంగానే కొనసాగించాలని కోరారు. అనంతరం ఆమెను ట్రస్టీ జనార్దన్‌రావు సత్కరించి జ్ఞాపిక అందించారు. ఉపాధ్యాయుల తరఫున మెమొంటో అందజేశారు.

ఎల్ఎండీ ఎస్సైగా చేరాలు

తిమ్మాపూర్: ఎల్ఎండీ ఎస్సైగా చేరాలును నియమిస్తూ శనివారం పోలీసు అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఇది ఇలాఉంటే తిమ్మాపూర్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్ రెడ్డి బదిలీ అయ్యారు. సీఐ ఇంద్రసేనారెడ్డిని మల్టీజోన్ ఐజీ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎవరిని నియమించలేదు. ఎస్సై ప్రమోద్ రెడ్డిని వీఆర్‌కు పంపారు.

పరీక్షలకు సన్నద్ధం కావాలి

సైదాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీని శనివారం ఇంటర్ బోర్డు జిల్లా విద్యాధికారి జగన్‌మోహన్‌రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ప్రతి విద్యార్థి త్వరలో జరుగబోయే పరీక్షలకు సన్నద్ధమై ప్రాక్టికల్, బోర్డు ఎగ్జామ్స్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రిన్సిపాల్ సత్యనారాంజనేయ, అధ్యాపకులు ఉన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి



మాట్లాడుతున్న సయ్యద్ మసూద్

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలో వ్యాపార, వాణిజ్య, ఇంటి పన్నులను వందశాతం వసూలు చేయాలని వరంగల్ ఆర్‌డీఎంఏ (రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటర్) సయ్యద్ మసూద్ సూచించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్‌ఐ, బిల్ కలెక్టర్, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2023-24 సంవత్సరానికి సంబంధించిన బిల్లులు మార్చి వరకు పూర్తిస్థాయిలో వసూలు చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. సమావేశంలో మేనేజర్ భూపాల్‌రెడ్డి, ఆర్‌ఐ వాణి తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

హుజూరాబాద్: నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి కోరారు. శనివారం హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌లో మాట్లాడారు. యువత డిసెంబర్ 31 రాత్రి మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ర్యాష్ డ్రైవింగ్ చేయకూడదన్నారు. అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. హుజూరాబాద్ డివిజన్ పరిధిలో ఎవరైనా ఈవెంట్స్ కార్యక్రమాలు నిర్వహించాలంటే ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే వారిపై కేసులు పెట్టడం జరుగుతుందన్నారు. హుజూరాబాద్ డివిజన్‌లో బెల్ట్‌షాపులు మూసివేయడం జరిగిందని, మద్యం షాపులవారు కూడా ప్రభుత్వం నిర్ణయించిన సమయం వరకే మద్యం విక్రయించాలని సూచించారు. సమావేశంలో టౌన్ సీఐ రమేశ్, జమ్మికుంట టౌన్, రూరల్ సీఐలు బర్పాటి రమేశ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

‘దళితులపై వివక్ష చూపుతున్న తహసీల్దార్’



పౌరహక్కుల దినోత్సవంలో నాయకులు తదితరులు

శంకరపట్నం: మండల తహసీల్దార్ అనుపమ దళితుల పట్ల వివక్ష చూపుతున్నారని తెలంగాణ అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు అంతడుపుల సతీశ్ ఆరోపించారు. మండలంలోని కన్నాపూర్‌లో శనివారం పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమం జరిగింది. ప్రతినెలా జరిగే పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమానికి మండల అధికారులు హాజరుకావడం లేదని దళితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి తహసీల్ కార్యాలయానికి వెళ్లినా తహసీల్దార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఆగ్రహం వ్యక్తం చేస్తూ సమస్యలు పరిష్కరించకుండానే కార్యాలయం నుంచి వెళ్లగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోకుంటే జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సర్పంచ్ వెంకటరమణారెడ్డి, ఉపసర్పంచ్ కుమార్, సిబ్బంది పర్శరాం, ఆర్‌ఐ లక్ష్మారెడ్డి, ఏఎస్సై లక్ష్మారెడ్డి, జూనియర్‌లైన్‌మెన్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్, సంఘం సభ్యులు శంకర్, వెంకటేశ్, అర్జున్ పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం

మానకొండూర్‌రూరల్: మండలంలోని వెల్దిలో పౌరహక్కుల దినోత్సవం జరిగింది. దళిత నాయకులు హాజరై అధికారులకు సమస్యలను విన్నవించుకున్నారు. ఆర్‌ఐ సత్యనారాయణ,సర్పంచ్ లక్ష్మి సాయికుమార్, ఏఎస్సై భాస్కరాచారి, వార్డుసభ్యులు గంగారాం, హేమలత, కార్యదర్శి సంపత్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సమావేశం

హుజూరాబాద్: హుజూరాబాద్ నియోజకవర్గంలోని ఎమ్మార్పీఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి, మహాజన సోషలిస్టు పార్టీ మండల కమిటీలను ఎన్నుకునేందుకు శనివారం హుజూరాబాద్ ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో సన్నాహక సమావేశం జరిగినట్లు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు తునికి వసంత్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవునూరి రవీందర్ తెలిపారు. హుజూరాబాద్ మండల కమిటీ ఎన్నికలు జనవరి 2న, వీణవంక మండల కమిటీ 3న, జమ్మికుంట, ఇల్లందకుంట 5న జరుగుతాయని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు రుద్రారపు రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజు దరఖాస్తుల వెల్లువ



చిన్నముల్కనూర్‌లో దరఖాస్తుల స్వీకరణ

గన్నేరువరం/చిగురుమామిడి/ఇల్లందకుంట/వీణవంక/సైదాపూర్/చొప్పదండి/మానకొండూర్: ప్రజాపాలన కార్యక్రమానికి ప్రజల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. గన్నేరువరం మండలం ఖాసీంపేట, మాదాపూర్, హన్మజిపల్లె, జంగపల్లి గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ బిక్షపతి, ఎంపీడీవో స్వాతి, ఏపీఎం లావణ్య, సర్పంచులు పాల్గొన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని చిగురుమామిడి మండల ప్రత్యేకాధికారి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాథనీయేల్ కోరారు. శనివారం మండలంలోని కొండాపూర్, లంబాడిపల్లి, ముదిమానిక్యం, చిన్నముల్కనూర్‌లో గ్రామసభలు నిర్వహించారు. జెడ్పీటీసీ గీకురు రవీందర్‌తో కలిసి చిన్నముల్కనూర్‌లో ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎంపీడీవో నర్సయ్య, తహశీల్దార్ నరేందర్, ఏవో రంజిత్‌రెడ్డి, డీఈ రవిప్రసాద్, ఎంపీవో శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. ఇల్లందకుంట మండలం మల్యాల, మర్రివానిపల్లి, మల్లన్నపల్లి, పాతర్లపల్లి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్ వరలక్ష్మి, ఆర్‌ఐ రవి, అధికారులు పాల్గొన్నారు. వీణవంక మండలం ఎల్బాక, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. బ్రాహ్మణపల్లిలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. తహసీల్దార్ తిరుమల్‌రావు, ప్రత్యేకాధికారి మహేశ్ తదితరులు ఉన్నారు. సైదాపూర్ మండలం గుండ్లపల్లి, గొడిశాల, గుజ్జులపల్లి, జాగీర్‌పల్లి గ్రామసభలు నిర్వహించారు. తహసీల్దార్ మంజుల, ఎంపీడీవో పద్మావతి తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు దరఖాస్తు ఫారాలను ఇంటింటికీ అందుబాటులో ఉంచామని చొప్పదండి మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. పట్టణంలోని నాల్గో వార్డులో దరఖాస్తుల ప్రక్రియను డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్, మేనేజర్ ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని మంగళపల్లి, కొలిమికుంట గ్రామాల్లో ప్రజాపాలన నిర్వహించారు. మానకొండూర్ మండలం ఈదులగట్టెపల్లి, చెంజర్ల, గట్టుదుద్దెనపల్లి, దేవంపల్లి గ్రామాల్లో 2,442 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీవో రాజేశ్వరరావు తెలిపారు. సూపరింటెండెంట్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిట్ల ప్రదర్శన



ప్రదర్శనలు తిలకిస్తున్న ప్రసాద్

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని వివేకవర్ధిని మోడల్ స్కూల్లో శనివారం గణితశాస్త్ర ప్రదర్శన, క్విజ్ కార్యక్రమాలను నిర్వహించారు. గణిత శాస్త్రం సులభంగా అర్థమయ్యేలా విద్యార్థులు నమూనాలను రుపొందించి ప్రదర్శించారు. పాఠశాల కరస్పాండెంట్ మాడిశెట్టి ప్రసాద్, ఉపాధ్యాయులు సదానందం, రజితారాణి, శారద తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని రాగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గణిత ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. నలుమాచు లింగయ్య స్మారకార్థం అతడి మనుమడు హరిప్రసాద్ నగదు బహుమతులు, పుస్తకాలు అందించారు. హెచ్ఎం లచ్చయ్య, శ్రీనివాస్, వెంకటరాంరెడ్డి, నర్సయ్య, గంగేశం, ప్రమీలాదేవి తదితరులు పాల్గొన్నారు. అలాగే గణితంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శ్రీనివాస మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాలు అందించారు. ప్రిన్సిపాల్ లక్ష్మణ్, హరిప్రసాద్, రమణారెడ్డి, రమేశ్, సత్యనారాయణ, భాగ్యలక్ష్మి, సౌజన్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ టైర్లు చోరీ

జమ్మికుంట: ట్రాక్టర్ టైర్లు చోరీకి గురైన ఘటన జమ్మికుంట మండలం శాయంపేట గ్రామంలో జరిగింది. పోలీసుల వివరాలు.. శాయంపేట గ్రామపంచాయతీకి సంబంధించిన వాటర్ ట్యాంక్ ట్రాక్టర్‌ను పంచాయతీ వద్ద నిలిపిఉంచారు. శుక్రవారం రాత్రి దొంగలు ట్రాక్టర్ టైర్లను ఎత్తుకెళ్లారు. వాటి విలువ రూ.60 వేల వరకు ఉంటుంది. సర్పంచ్ ఆకినపల్లి సుజాత ఫిర్యాదు మేరకు శనివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేశ్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

జమ్మికుంట: పట్టణంలో శనివారం రాత్రి పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు సీఐ రమేశ్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల ఎదురుగా ఉన్న ఓ క్లినిక్‌లో ఏడుగురు పేకాట ఆడుతుండగా సీఐ ఆధ్వర్యంలో దాడులు చేసి అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.7,500 నగదు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఆలస్యంగా దరఖాస్తుల స్వీకరణ



అధికారుల కోసం నిరీక్షిస్తున్న గ్రామస్తులు

శంకరపట్నం: మండలంలోని ధర్మారం గ్రామపంచాయతీ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి అధికారులు ఆలస్యంగా హాజరయ్యారు. ఇతర గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాలు జరుగుతుండటంతో ఆలస్యంగా ప్రారంభం అవుతుందని సిబ్బంది తెలిపారని గ్రామస్తులు పేర్కొన్నారు. మధ్యాహ్నం 1గంట గడిచినా అధికారులు రాకపోవడంతో గ్రామస్తులు నీరసించిపోయారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అయోధ్య అక్షింతల శోభాయాత్ర



మన్నెంపల్లిలో నెత్తిన అక్షింతలతో అనిల్‌గౌడ్, గ్రామస్తులు



సైదాపూర్‌లో అక్షింతల శోభాయాత్ర

తిమ్మాపూర్/గంగాధర/సైదాపూర్/చిగురుమామిడి: అయోధ్య రాముని అక్షింతలు తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లికి శనివారం చేరుకున్నాయి. ఉప సర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్ అయోధ్య అక్షింతలకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. కొయ్యడ శ్రీనివాస్‌గౌడ్, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గొల్ల గణేశ్, రావుల శ్రీనివాస్‌గౌడ్, కొయ్యల తిరుపతిగౌడ్, రావుల మల్లేశంగౌడ్, నాంపల్లి శంకర్, కందుకూరి నరేందర్, మహేందర్, ఈశ్వరచారి, పైడిపల్లి సంజీవ్, కొలిపాక కిరణ్, అనగోని శ్రీనివాస్, కందుకూరి ఆనందచారి తదితరులు పాల్గొన్నారు. గంగాధర మండలం గట్టుభూత్కూర్‌లో అయోధ్య అక్షింతలకు గ్రామస్తులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేసి మేళతాళాలతో ఊరేగించారు. కంకణాల రాజగోపాల్‌రెడ్డి, కంకణాల విజయేందర్‌రెడ్డి, రోమాల రమేశ్, జాతరకొండ మహేశ్, కిరణ్, తిరుపతి, రాజు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. సైదాపూర్ మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ తొంట ఓదెలు, మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్, కూతురు విద్వాన్‌రెడ్డి, కృష్ణమూర్తి, దాసరి కనుకయ్య, రాహుల్ తదితరులు పాల్గొన్నారు. చిగురుమామిడి మండల కేంద్రంలో శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కొత్త వినీతశ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ గీకురు రవీందర్ భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.